# మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక




ప్రజావాణి దరఖాస్తులపై

**ప్రత్యేక దృష్టి**

కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

2


సంపుటి : 01 | సంచిక : 156 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | మంగళవారం, 05 మే 2026 | పేజీలు : 4




# రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

- **రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**జనగామ, మన చౌరాస్తా :** రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యాసంగి వరి ధాన్యం కొనుగోలు చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ లోని సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కు మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తితో కలిసి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఈ వీడియో సమావేశానికి హాజరయ్యారు. ఈ నేపథ్యంలో మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అకాల వర్షాలు కురుస్తున్నందున కొనుగోలు కేంద్రాల్లో రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ వర్షం కురుస్తున్నందున రైతులు తమ ధాన్యం కుప్పలను ఎత్తు ప్రాంతంలో ఉంచుకోవాలన్నారు. గాలులకు టార్పాలిన్ కవర్లు ఎగిరి పోకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అధికారులు వాతావరణ శాఖ హెచ్చరికలను రైతులకు తెలియజేయాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా తాగునీరు, షామియానా, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. తేమ యంత్రాలు, ఆటోమేటిక్ ప్యాడీ క్లీనర్లు అందుబాటులో ఉంచాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలన్నారు. ఎక్కడ కూడా జాప్యం చేయకూడదన్నారు. హమాలీలు, వాహనాల కొరత రాకుండా సర్దుబాటు చేసుకోవాలన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రాలకు గ్రామ, మండల స్థాయి అధికారులు పర్యవేక్షించాలన్నారు. మే నెల చివరి కల్లా 80% ధాన్యం కొనుగోళ్ళు పూర్తి చేయాలన్నారు. ఈ వీసీ అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ.. అన్ని కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగ్ లు సరిపడా ఉండేలా చూసుకోవాలని, అలాగే ఏ రోజుకు ఆరోజు ధాన్యం కొనుగోలు వివరాలను తెలియజేయాలని, ఓపీఎంఎస్ లో వెంటనే ధాన్యం కొనుగోళ్ల వివరాలను నమోదు చేసి, 24 గంటల్లో రైతుల ఖాతాలో డబ్బులు జమ అయ్యేలా చూడాలని పౌరసరఫరాల డీఎం సీఎస్ కు తెలిపారు. అలాగే వాతావరణ పరిస్థితులను తెలుసుకొని, వర్ష సూచనలు ఉంటే, వెంటనే ఆ సమాచారాన్ని కేంద్ర నిర్వాహకులకు, రైతులకు తెలియజేయాలన్నారు. టోకెన్ పద్ధతి ద్వారా మాత్రమే ధాన్యం కొనుగోలు చేయాలని, లోడింగ్, రవాణా ఏక కాలంలో జరగాలన్నారు. సరిపడా హమాలీలను పెట్టుకోవాలని, రవాణా పరంగా ఇబ్బందులకు గురి చేస్తే తక్షణమే వారిపై చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ అధికారికి సూచించారు. ప్రతి రోజూ రైస్ మిల్లులను తనిఖీ చేయాలని, కొనుగోలు అయిన ధాన్యం త్వరగా దిగుమతి అయ్యేలా పర్యవేక్షించాలన్నారు. పంట నమోదు ప్రక్రియలో తప్పిదాలు చేసే ఏఈఓల మీద కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి కేంద్రానికి ఒక వాహనాన్ని కేటాయించడం జరిగిందని, ఇప్పటికీ ఆయా కేంద్రానికి వాహనం పెట్టని వారిపై చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ అధికారికి తెలిపారు. అకాల వర్షాలు సంభవిస్తే ధాన్యం తడవకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి అయ్యేంత వరకు గ్రామ, మండల, జిల్లా స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉంటూ యాసంగి ధాన్యం సాఫీగా కొనుగోలు అయ్యేలా పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జెడ్పీ సీఈవో రంగా రావు, డీఆర్డీఓ నూరుద్దీన్, డీఏఓ అంబికా సోనీ, డీఎంఓ రామ కృష్ణ, డీడబ్ల్యూఓ కోదండరాములు, ఆర్టీఓ శ్రీనివాస్ గౌడ్, డీసీఎస్ఓ పావని, ఇతర సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవలకు నిదర్శనం

# లయన్స్

- **మంత్రి శ్రీధర్ బాబు**

3 లో





wanted

విలేకరులు కావలెను



మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సంప్రదించగలరు.

manachourasta@gmail.com

8555800812 | 9676400812

సామాన్యుడి గొంతుకగా.. సామాజిక సమర వేదికగా..

మన చౌరాస్తా

The Complete News way





# ప్రజావాణి అర్జీలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**జనగామ, మన చౌరాస్తా :** ప్రజావాణిలో వివిధ సమస్యలతో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిష్కరించేందుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోంతో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా 151 ఆర్జీలను కలెక్టర్ స్వీకరించారు. వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందించి, ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి అర్జీల పరిష్కారంలో వేగం పెంచి, త్వరితగతిన పూర్తిచేయాలని స్పష్టం చేశారు. ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన దరఖాస్తుల లోని కొన్నింటి వివరాలు..

జనగామ మండలం చీటకోడూరు గ్రామానికి చెందిన కె. గణేష్ యాదవ్, తాను బీసీ డీ, యాదవ కులం పేదవాడు అని, తల్లిదండ్రులు కూలి పని చేస్తుంటారని, భూమి జాగా లేదు అని, ప్రైవేట్ లో చదివించే స్థోమత లేదని, బీసీ సంక్షేమ ఎంజేపీలో చదవాలనే కోరిక ఉందని, కావున సీటు ఇప్పించగలరని దరఖాస్తు చేసుకున్నారు.

పటేల్ గూడెం గ్రామం, లింగాల ఘనపురం మండలానికి చెందిన జే.సురేష్ తనకు ఇచ్చిన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం విద్యుత్ తీగల వల్ల ఆగిందని, దీంతో ఆర్థికంగా, ఇంట్లో సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తు చేసియున్నారు.

సిరిసన్నగూడెం గ్రామం, పాలకుర్తి మండలానికి చెందిన ఎస్. కొమ్రమ్మ తను నిరుపేద కుటుంబానికి చెందిన తనకు తనకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇప్పించుట గురించి ఆర్జీ ద్వారా కోరారు.

వెంకిర్యాల గ్రామం, జనగామ మండలానికి చెందిన మామిడి అంజయ్య, తనకు పెంకుటిల్లు ఉందని, కానీ అది కూలిపోతుందని, ఉండటానికి వీలు లేకుండా ఉందని, ప్రస్తుతం అద్దెకు ఉంటున్నారని, డబుల్ బెడ్ రూం ఇల్లు కొరకు వినతిపత్రం సమర్పించనైనది.

చీటూరు గ్రామం, లింగాల ఘనపురం మండలానికి చెందిన గ్రామ పంచాయతీ సర్పంచి బర్ల గణేష్, గ్రామంలో గల ఎంపీపీఎస్ పాఠశాలకు అదనపు తరగతి గదులు, వంటశాల షెడ్ నిర్మాణాలకు మంజూరు కోరుతూ దరఖాస్తును సమర్పించారు.

ప్రజావాణి అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ.. అన్ని శాఖల జిల్లా అధికారులు, వారి పరిధిలో ఉండే సిబ్బంది స్వీయ గణన నమోదును చేపట్టాలని తెలిపారు.

ఈ ప్రజావాణిలో జెడ్పీ సిఈఓ రంగారావు, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పీడీ మాతృ నాయక్, డీఎంహెచ్ఓ మల్లికార్జున రావు, డీడబ్ల్యూఓ కోదండ రాములు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# కరాటేలో అక్షిత్ మనివర్ధన్‌కు బ్లాక్ బెల్ట్

## నిక్షిత్‌కు బ్రౌన్ బెల్ట్ షోధాన్

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా కేంద్రానికి చెందిన ఓరుగంటి అక్షిత్ మనివర్ధన్ కరాటేలో బ్లాక్ బెల్ట్ సాధించగా, నిక్షిత్ మణివర్ధన్ బ్రౌన్ బెల్ట్‌లో షోధాన్ సర్టిఫికేట్ పొందినట్లు కరాటే మాస్టర్ సంతోష్ కుమార్ తెలిపారు. విక్టరీ షోటోకాన్ కరాటే అకాడమీ ఇండియా చీఫ్ రంగు మల్లికార్జున్ గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని మొయినాబాద్‌లో నిర్వహించిన బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో ఈ విజయాలు సాధించారు. ఈ సందర్భంగా అక్షిత్ మనివర్ధన్, నిక్షిత్ మణివర్ధన్‌లను విక్టరీ షోటోకాన్ కరాటే అకాడమీ గౌరవ అధ్యక్షుడు, సినీ హీరో సుమన్ తల్వార్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అకాడమీ సీనియర్ మాస్టర్లు శ్రీనివాస్, వెంకటేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.





# మట్టి పరీక్షలు తప్పనిసరి చేయించాలి

■ **జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**జనగామ, మన చౌరాస్తా :** రైతు సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి, వ్యవసాయ అనుబంధ రంగాల ప్రోత్సాహం, రైతులను ఆర్థికంగా బలోపేతం చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రైతు వారోత్సవాలను నిర్వహిస్తోందని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. సోమవారం జనగామ మండలంలోని చౌడారం గ్రామ పంచాయతీ పరిధిలో గల రైతు వేదికలో ఏర్పాటు చేసిన రైతు సంక్షేమ వారోత్సవాల కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంబికా సోని, డిప్యూటీ డైరెక్టర్ అఫ్ అగ్రికల్చర్ అనితా, జిల్లా ఉద్యనవన శాఖ అధికారి రమాకాంత్, చీటకోడూరు సర్పంచ్ యాదగిరి, చౌడారం ఉప సర్పంచ్ ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.



# డీసీసీ కార్యాలయంలో సంబురాలు

**జనగామ, మన చౌరాస్తా :** కేరళ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ సాధించిన ఘన విజయాన్ని పురస్కరించుకుని జనగామ డీసీసీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు ఘనంగా సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వీట్లు పంచుకుని ఆనందం వ్యక్తం చేశారు. డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ ప్రజా అనుకూల విధానాలను అమలు చేస్తోందని తెలిపారు. కేరళ ప్రజల తీర్పు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి కొత్త ఉత్సాహాన్ని ఇచ్చిందని అన్నారు. తెలంగాణలో కూడా పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఇదే సందర్భంగా జనగామ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ)లో తాజాగా నియమితులైన నాయకులు అధ్యక్షురాలిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కొత్త కరుణాకర్ రెడ్డి, ఉడత రవి యాదవ్, నూకల బాల్ రెడ్డి. ప్రధాన కార్యదర్శులు జిల్లెల్ల సిద్దారెడ్డి, ఎం.డి. అన్వర్, కోశాధికారి సరభూ మధు, కార్యదర్శులు జొన్నగాని కిష్టయ్య, అర్జుల సుధాకర్ రెడ్డి, లింగాల రాజేందర్ రెడ్డి, తాటికొండ సంపత్, శాగంటి మణిధర్ కృతజ్ఞతలు తెలిపిన వారిలో ఉన్నారు. అలాగే జనగామ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని, పార్టీని మరింత బలంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య నాయకులు ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గనిపాక మహేందర్, నిమ్మతి మహేందర్ రెడ్డి, సీనియర్ నాయకుడు బుస్సా అంజయ్య, చింతకింది మల్లేష్, జనగామ పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు పిట్టల సతీష్, మోటే శ్రీనివాస్, ఆకుల లక్ష్మయ్య, గాలి కృష్ణ, కర్రే రాజశేఖర్,బీసీ సెల్ చిల్పూర్ మండల అధ్యక్షుడు కండ్లకోళ్ల బాలరాజు, వెంకటేశ్వరపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు శివరాజ్ యాదవ్, మహబూబ్, గొట్టె రాజశేఖర్, గోపగోని నరేష్, నర్సింహులు పాల్గొన్నారు.



# కనులపండువగా 'బీరప్ప' కళ్యాణం

- హాజరైన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, మున్సిపల్ చైర్మన్ బాలమణి

**రఘునాథపల్లి, మన చౌరాస్తా :** జనగామ జిల్లా కోడూరు గ్రామంలో శ్రీ బీరప్ప కామరాతి కల్యాణ ఉత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో అత్యంత కీలక ఘట్టమైన కామరాతి సమేత బీరప్ప స్వామి కళ్యాణ మహోత్సవం సోమవారం భక్తుల జయజయధ్వానాల మధ్య కనులపండువగా సాగింది.

**కురుమ సంప్రదాయం.. ఆధ్యాత్మిక శోభ**

కురుమ సంప్రదాయాలను ప్రతిబింబించేలా బీరప్ప పూజారులు కళ్యాణ వేడుకను శాస్త్రోక్తంగా నిర్వహించారు. బీర్ల కళాకారుల వీర విన్యాసాలు, డోలు వాయిద్యాల మోతతో కోడూరు పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ఈ వేడుకను తిలకించేందుకు ఉమ్మడి జిల్లా నలు మూలల నుండి భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం జనసందోహంగా మారింది.

**విశిష్ట అతిథుల పూజలు**

ఈ కళ్యాణ వేడుకలో ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, జనగామ మున్సిపల్ చైర్మన్ కడకంచి బాలమణి శ్రీనివాస్ పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. కళ్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమం కమిటీ సభ్యులు కుల పెద్ద మనిషి కర్రె రాములు, గొరిగే యాదయ్య, మాజీ సర్పంచ్ జోగు గట్టయ్య, మాజీ ఎంపిటి సీ గొరిగే భాస్కర్, సానిక ఉమేందర్, సానిక చంద్రయ్య,కొలుపుల వెంకన్న, రేగు భాస్కర్, కాడే వినోద్, గొరిగే చిన్న యాదయ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.






# నిస్వార్థ సేవలకు నిదర్శనం లయన్స్

- మంత్రి శ్రీధర్ బాబు
- ఘనంగా లయన్స్ మల్టిపుల్ జిల్లా దశమ వార్షికోత్సవం

**హైదరాబాద్, మన చౌరాస్తా :** సమాజంలోని అవసరార్థులను ఆదుకోవడంలో నిస్వార్థ సేవలకు నిలువెత్తు నిదర్శనంగా ఉన్న లయన్స్ క్లబ్ లు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో కృషి చేస్తున్న విద్యా వైద్య రంగాల అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర శాసన సభ వ్యవహారాల మంత్రి డి. శ్రీధర్ బాబు కోరారు. మే 2, 3 తేదీలలో జరిగిన లయన్స్ మల్టిపుల్ జిల్లా దశమ వార్షికోత్సవం లో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మల్టిపుల్ కౌన్సిల్ (జిల్లా) చైర్మన్ లయన్ టి రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలో మంత్రి మాట్లాడుతూ తాను చిన్నతనంలో తన తండ్రి దివంగత నాయకుడు శ్రీపాదరావు తో కలిసి లయన్స్ క్లబ్ మీటింగు లలో పాల్గొన్న సంఘటనలను గుర్తుచేశారు. ప్రపంచ వ్యాప్తంగా విస్తరించి సమాజ సేవ చేస్తున్న లయన్స్ క్లబ్ ల సేవలు అద్భుతం అని కొనియాడుతూ రాష్ట్రంలో లయన్స్ సేవలు వృద్ధి చెందటానికి ప్రభుత్వం తప్పక సహకరిస్తుందని, లయన్స్ సేవా కేంద్ర భవన సముదాయం నిర్మాణానికి కావలసిన భూమి ముఖ్య మంత్రి తో మాట్లాడి ఇప్పిస్తానని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కృషి చేస్తున్న విద్యా. వైద్య రంగాల అభివృద్ధికి తమ తమ ప్రాంతాలలో లయన్స్ చేయూత నివ్వాలని కోరారు. మంత్రిని పూర్వ మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ లయన్ డా. గుర్రం శ్రీనివాస్ రెడ్డి పరిచయం చేయగా పూర్వ ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ ఆర్. సునీల్ కుమార్ మంత్రి ప్రసంగానికి స్పందించి కృతజ్ఞతలు తెలిపారు. లయన్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ పి ఐ డి డా. జి. బాబురావు మాట్లాడుతూ సంస్థ వ్యాప్తి కోసం ప్రతి ఒక్క నాయకుడు బాధ్యతగా సహకారం అందించాలని కోరారు.మొదటి రోజు జరిగిన కౌన్సిల్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కౌన్సిల్ 11 వ చైర్మన్ గా 320డి జిల్లా గవర్నర్ లయన్ ఏ. అమర్నాథ రావు, వైస్ చైర్మన్ గా 320ఎఫ్ జిల్లా గవర్నర్ లయన్ డా. చంద్రశేఖర్ ఆర్య, కార్యదర్శి గా 320జి జిల్లా గవర్నర్ లయన్ ఎస్. కోదండరాం, కోశాధికారిగా 320సి జిల్లా గవర్నర్ లయన్ కె. ఇన్నారెడ్డి ఎన్నికయ్యారు. సాయంత్రం పూర్వ జిల్లా గవర్నర్ల ఫోరం సమావేశం ఫోరం చైర్మన్ జి ఆర్ సూర్యరాజ్ అధ్యక్షతన నిర్వహించి సమీక్షచేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఉన్న 8 లయన్స్ జిల్లాలలో ఎన్నికైన నూతన జిల్లా గవర్నర్ టీం సభ్యులను సభకు పరిచయం చేశారు. లయన్స్ క్వెస్ట్ కార్యక్రమం విజయవంతం లో భాగస్వాములైన టీచర్స్ ను గుర్తించి క్వెస్ట్ మల్టిపుల్ చైర్మన్ ముచ్చ రాజిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్వెస్ట్ మల్టిపుల్ సారథులు డా బాబు రావు, తీగల మోహన్ రావు, ఏ. శివప్రసాద్ జిల్లాల గవర్నర్లు కౌన్సిల్ వైస్ చైర్మన్ ఎన్. మనోహర్ రెడ్డి, కార్యదర్శి కుందూరు వెంకటరెడ్డి, కోశాధికారి నాగేష్ పంపాటి పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన క్లబ్ ల సారథులు అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి లకు, గ్లోబల్ యాక్షన్ టీం లీడర్స్, జిల్లా క్యాబినెట్ కార్యదర్శి, జిల్లా క్యాబినెట్ కోశాధికారులకు జి ఎల్. టి కోఆర్డినేటర్ సీహెచ్ ప్రకాశరావు పర్యవేక్షణలో శిక్షణ శిబిరాలు నిర్వహించారు.చివరి రోజు ఉదయం నిర్వహించిన శ్రద్ధాంజలి కార్యక్రమంలో గత సంవత్సర కాలంలో దివంగతులైన లయన్ నాయకుల ఆత్మ కు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా. మల్టిపుల్ పి ఆర్ ఓ లయన్ కన్న పరశురాములు సంపాదకత్వంలో ప్రచురించిన అగ్రగామి ప్రత్యేక సంచికను పూర్వ ఇంటర్నేషనల్ డైరెక్టర్ లు డా. బాబు రావు, ఆర్. సునీల్ కుమార్ ఆవిష్కరించారు. మహాసభకు ఆతిథ్యం ఇచ్చి హోస్ట్ చేసిన 320డి జిల్లా నాయకులు చక్కని ఏర్పాట్లను చేసి సభ్యుల అభిమానం చూరగొన్నారు. ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ జి ఆర్ సూర్యరాజ్, కన్వెన్షన్ చైర్మన్ గోలి అమరేందర్ రెడ్డి, చీఫ్ కోఆర్డినేటర్ ఎస్. ఎం. రెడ్డి, ఎస్. నరేందర్ రెడ్డి, జిల్లా గవర్నర్ టీం సభ్యులు ఏ. అమరనాథ్ రావు, డా. విజయలక్ష్మి, డి. నరసింహరాజు, టి. పద్మావతి, జిల్లా క్యాబినెట్ కార్యదర్శి ఎల్. శ్రీనివాసరెడ్డి, కోశాధికారి మర్రి ప్రవీణ్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పూర్వ చైర్మన్ లు, పూర్వ జిల్లా గవర్నర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





కల్కి-2 షూటింగ్‌లో

# ప్రభాస్ చేరిక

ప్రభాస్ అభిమానులతో, సైన్స్ ఫిక్షన్ జోనర్ సినిమాలను ఇష్టపడే ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రాజెక్టుల్లో ఒకటి 'కల్కి 2898 `2' ప్రాంచైజీ. ఇప్పటికే ఫస్ట్ పార్ట్‌తో బాక్సాఫీస్‌ను షేక్ చేసిన ప్రభాస్`నాగ్ అశ్విన్ టీం ఇక సీక్వెల్‌తో ఎంటర్‌టైన్ చేసేందుకు రెడీ అవుతున్నారని తెలిసిందే. అయితే సీక్వెల్ ఎప్పుడు సెట్స్‌పైకి వెళ్తుందా అని ఎదురుచూస్తున్న మూవీ లవర్స్ కోసం ఇప్పటికే అమితాబ్ బచ్చన్ షూట్‌లో పాల్గొన్నట్టు ఆసక్తికర అప్‌డేట్ ఒకటి బయటకు వచ్చింది. తాజాగా మరో ఆసక్తికర వార్త బయటకు వచ్చింది. హీరో ప్రభాస్ కల్కి సీక్వెల్ షూట్‌లో జాయిన్ అయ్యాడట. ఎక్కువగా నైట్ షూట్స్ ఉండనుండగా.. కొన్ని రోజులపాటు ఈ షెడ్యూల్‌లో పాల్గొనున్నట్టు ఇన్‌సైడ్ టాక్. మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రభాస్ షూట్‌కు సంబంధించి మేకర్స్ ఏమైనా అప్‌డేట్స్ అందిస్తారేమో చూడాలి. కాగా ఫస్ట్ పార్ట్‌లో దీపికా పదుకొనే పోషించిన సుమతి పాత్ర కోసం సీక్వెల్‌లో ఇంకా ఏ నటిని ఫైనల్ చేయలేదు మేకర్స్. కమల్ హాసన్‌తోపాటు పలువురు కీలక నటీనటులు సీక్వెల్‌లో కనిపించబోతున్నట్టు తెలుస్తుండగా.. మేకర్స్ నుంచి అప్‌డేట్ రావాల్సి ఉంది. భారీ విజువల్ వండర్‌గా మారిన 'కల్కి'లో ప్రభాస్, దీపికా పదుకొణె, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ లాంటి లీడ్‌యాక్టర్లు నటించడంతో ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా రూ.1000 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. భారీ విఎఫ్ఎక్స్, యూనిక్ కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల మన్ననలు పొందింది. ఫస్ట్ పార్ట్‌ను తెరకెక్కించిన వైజయంతీ మూవీస్ బ్యానర్‌పై సీ అశ్వనీదత్ ఈ చిత్రాన్నినిర్మించనున్నారు.

Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**